క్లుప్తంగా

కోడూరు బీచ్‌లో సందడి



తోటపల్లిగూడూరు: కోడూరు బీచ్‌కు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న ప్రజలు ఉపశమనం పొందేందుకు బీచ్‌కు వెల్లువలా తరలివస్తున్నారు.

చదువులో పోటీతత్వం పెరగాలి



చిన్నారుల నృత్య ప్రదర్శన

కోవూరు: చిన్నతనం నుంచే చదువులో పోటీతత్వం పెరగాలని ఎంఈఓలు రహీమ్, చెంచులక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని సరోజినీదేవి పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో ముఖ్యమన్నారు. చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్లు శివకుమార్, నందకిశోర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కండలేరులో 47.806 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 47.806 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

విలువైన వాహనాలు.. మట్టిపాలు

- పోలీస్‌స్టేషన్‌లలో గుట్టలుగా వాహనాలు
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..
- మట్టిలో కలుస్తున్న ప్రజాధనం

ఏదైనా కేసులో పోలీస్‌స్టేషన్‌కు వాహనాలు చేరితే సంవత్సరాల తరబడి అలాగే ఉండిపోతున్నాయి. ఎంతో విలువైన వాహనాలు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. ఇలా రూ.లక్షల విలువ చేసే ప్రజాధనం తుప్పు పట్టి నిరుపయోగమవుతోంది. నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో ఇదే పరిస్థితి నెలకొంది.



కొడవలూరులో దెబ్బతిన్న పాఠశాల వ్యాన్‌లు

కొడవలూరు : ప్రమాదాలు జరిగినా, సంబంధిత పత్రాలు లేకుండా నడిపినా, గంజాయి లాంటి నిషేధిత మత్తు పదార్థాలు, ఎర్ర చందనం తరలిస్తూ పట్టుకున్న వాహనాలపై పోలీసులు కేసులు పెట్టి స్టేషన్‌లకు తరలిస్తారు. ఇవి కేసులు పరిష్కారం కాకనో లేక కేసులో పట్టుబడిన వాహనాలపై యజమాని ఆసక్తి చూపకపోవడమో తదితర కారణాలతో సంవత్సరాల తరబడి అక్కడే ఉండిపోతున్నాయి. ఎంతో విలువైన ఈ వాహనాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. అందులోనూ కొన్ని పోలీస్‌స్టేషన్‌లలో వీటిని ఉంచేందుకు స్థలం లేక ఎక్కడైనా ఖాళీ స్థలం ఉంటే అక్కడ పెట్టేస్తున్నారు. ఆ తరువాత వాటి గురించి పట్టించుకోవడం లేదు. అలా పెట్టిన వాహనాల్లో ఉపయోగపడే వస్తువులు మాయమవుతున్నాయి.

ఇంటి దొంగల పనేనా?

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్టేషన్‌కు తీసుకొస్తే వాటికి సంబంధించిన టైర్లు, ఇంజిన్, బ్యాటరీ, స్పీకర్ బాక్స్‌లు తదితర ఇతర వాహనాలకు ఉపయోగపడే విలువైన వస్తువులు ఒకట్రెండు రోజుల్లోనే మాయం చేస్తున్నారు. ఒకవేళ త్వరితగతిన కేసులు పరిష్కారమైనా వాహనంలో విలువైన వస్తువులు చోరీకి గురై ఉండడంతో యజమానులు వాటిని తీసుకుపోయేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇది ఇంటి దొంగల పనేనా అనే అనుమానాలు కూడా ప్రజల్లో బలంగా ఉన్నాయి.

ఆసక్తి చూపక..

ఏళ్లుగా కేసులు పరిష్కారం కాని వాహనాలు తుప్పు పట్టి ఉండడంతో యజమాని ఆ వాహనాన్ని తీసుకుపోయేందుకు ఆసక్తి చూపడం లేదు. తనపై ఉన్న కేసు పరిష్కారమైంది.. అదే చాలని భావించి మరో వాహనాన్ని కొనుగోలు చేస్తున్నారే తప్ప పాత వాహనాన్ని తీసుకుపోవడం లేదు. దీంతో ఏటా వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో పాటు తుప్పు పట్టి పనికి రాకుండా పోతున్నాయి. కొడవలూరు, కోవూరు, విడవలూరు తదితర పోలీస్‌స్టేషన్‌లలోనైతే విలువైన వ్యాన్‌లు, కార్లు సైతం తుప్పు పట్టి చెట్లు అల్లుకుపోయి ఉన్నాయి. పోలీస్‌స్టేషన్‌ల వద్ద రూ.లక్షలు విలువ చేసే ప్రజాధనం మట్టిలో కలిసిపోతోంది.

గతంలో వేలంపాటతో ప్రభుత్వానికి రాబడి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టుబడిన వాహనాల కేసులను త్వరితగతిన పరిష్కరించి యజమానులు తీసుకుపోకుంటే వెంటనే వేలం వేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి మూడు నెలలకు పోలీసు, సెబ్ స్టేషన్‌లలో వేలం నిర్వహించేవారు. ఈ విధంగా చేయడం వల్ల విలువైన వాహనాలు మట్టిలో కలిసిపోకుండా ప్రభుత్వానికి రాబడి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి కన్పించడం లేదు. పట్టుబడిన వాహనాలను నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీనివల్ల ప్రజాధనం వృథా అవుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు.

ప్రత్యేక చట్టం అవసరం

వాహనాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ప్రజాధనం తుప్పు పట్టిపోకుండా వాహనాలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించేలా నూతన చట్టం తీసుకురావాలి. ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు కాకుండా తక్కువ వ్యవధిలోనే కేసులను పరిష్కరించి యజమానికి ఇవ్వడమో లేక వేలం వేయడమో చేయాలి. తద్వారా ప్రజాధనం వృథా కాకుండా కాపాడవచ్చు.

చికెన్ వ్యర్థాల వాహనాలకు మాత్రమే..



కోవూరు నియోజకవర్గంలో చికెన్ వ్యర్థాలను చేపల గుంతలకు తరలింపును నిషేధించారు. అయినప్పటికీ కాసులు కురిపించుకొంటున్న కొందరు వ్యాపారులు రాత్రి వేళల్లో దొంగచాటుగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నారు. గతంలో ట్రక్కున్న మినీ లారీల్లాంటి వాహనాల్లో తరలిస్తుండగా ఇప్పుడు రూటు మార్చి వాహనంలోని డ్రమ్ములు కనిపించకుండా ఉండేలా కంటైనర్ వాహనాల్లో తరలిస్తున్నారు. ఈ వాహనాలపై పోలీసులు దాడి చేసి పట్టుకోవడం నియోజకర్గంలోని అన్ని స్టేషన్‌లలో చోటుచేసుకుంటోంది. ఇలా పట్టుకున్న వాహనాలు మాత్రం కొద్ది రోజులకే స్టేషన్ వద్ద లేకుండా యజమాని వద్దకు చేరుతోంది. దీంతో వ్యర్థాల తరలింపు ఆగకుండా యథావిధిగా కొనసాగుతోంది.



కోవూరులో విలువైన వాహనాలిలా..



కోవూరులో పనికి రాకుండా పోయిన వాహనాలు



కొడవలూరులో వదిలేశారిలా..

బంగారు నగల చోరీ



పరిశీలిస్తున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని బృందావన కాలనీలో తాళం వేసిన ఇంట్లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు బంగారు నగలను చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. బృందావన కాలనీలో నివాసం ఉంటున్న జనార్దన్‌రెడ్డి వ్యక్తిగత పనిమీద ఉదయం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా అల్మారాలో ఉన్న తొమ్మిది సవర్ల బంగారు నగలను చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. ఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించామని ఎస్సై సంతోష్‌రెడ్డి ఆదివారం తెలిపారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను సర్వేపల్లి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కాకుటూరు రవీందర్‌రెడ్డి, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ ఆవిష్కరించారు. అసనాపురం శ్రీనివాసులు, నరేష్, రాధారెడ్డి, దయాకర్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

⇨ **పొదలకూరు:** పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో నేతలు బీజేపీ జెండాను ఆవిష్కరించారు. మండల నాయకులు పెంచలరెడ్డి, ధనుంజయరావు, సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, ప్రశాంత్, వేణుగోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

⇨ **కొడవలూరు (బుచ్చిరెడ్డిపాళెం):** బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుచ్చిరెడ్డిపాళెంలో రామిశెట్టి కల్యాణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కోనేటిమిట్టలోని జెండాను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం విజయకుమార్ పాల్గొని, మాట్లాడారు.

పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం జరగాలి



ర్యాలీ చేస్తున్న ఐక్య వేదిక నాయకులు

కొడవలూరు: పాస్టర్ పగడాల ప్రవీణ్ కుటుంబానికి తగిన న్యాయం జరగాలని క్రైస్తవ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మండలంలోని నార్తురాజుపాళెంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నార్తురాజుపాళెం కూడలిలో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక సభ్యులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిలో అనేక అనుమానాలున్నాయన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సాల్మన్‌రాజ్, వేదిక సభ్యులు తువ్వర ప్రవీణ్‌కుమార్, ప్రభాకర్ జాకబ్ సుధీర్, జొన్నాతన్, నెహమ్యా, ప్రదీప్, అనిల్ కుంబ్లే, సూర్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళెం పట్టణం పెద్దూరులో కొలువైన కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



వేగంగా అభివృద్ధి చెందాలి

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కొడవలూరు: పరిశ్రమలు, పాడి పంటలతో కోవూరు నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని నార్తురాజుపాళెం రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి ఆమె ఆదివారం హాజరై తిలకించారు. అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించి మాట్లాడారు. శ్రీరాముడు ఆచరించి చూపిన జీవన మార్గాలు ప్రతి దశలోనూ మనకు స్ఫూర్తినిస్తాయన్నారు. పెన్నా డెల్టా చైర్మన్ జె.రాజగోపాల్‌రెడ్డి, నాయకులు బి.వంశీకృష్ణారెడ్డి, ఎ.శ్రీధర్‌రెడ్డి, డి.శ్రీనివాసులు నాయుడు, ఇరువూరు శ్రీధర్‌రెడ్డి, జి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నార్తురాజుపాళెం రామాలయంలో ఎమ్మెల్యే పూజలు

కల్యాణం.. కమనీయం



ముత్తుకూరు: సీతారాముల కల్యాణోత్సవం



మనుబోలు : పూజలందుకుంటున్న సీతారాములు



టీపీగూడూరు: కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



పొదలకూరు : ప్రత్యేకాలంకరణలో సీతారాములు



ముత్తుకూరు: వల్లూరులో ప్రత్యేకాలంకరణలో సాయిబాబా



కొడవలూరు: నార్తురాజుపాళెంలో అన్నదానం

పొదలకూరు: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. వందలాది మంది భక్తులు విచ్చేశారు. ఉభయకర్తలుగా దేవినేని నాగేశ్వరరావు వ్యవహరించారు. ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో నగర సంకీర్తన జరిగింది. కల్యాణం అనంతరం అన్నప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మందిర సేవా సమితి సొసైటీ బాధ్యులు పాల్గొన్నారు.

⇨ పట్టణంలోని శ్రీరామమందిరంలో నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిగాయి.

⇨ మండలంలోని మరుపూరు గ్రామ శ్రీరామాలయంలో నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారాములు భక్తులకు ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చారు. ఏర్పాట్లను గ్రామ పెద్ద వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

⇨ శ్రీఅయ్యప్ప నగర్ కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. భక్తులు హాజరుకావాల్సిందిగా కోరారు.

⇨ **ముత్తుకూరు:** శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ముత్తుకూరు, కృష్ణపట్నం, పంటపాళెం, పిడతాపోలూరు, నారికేళపల్లి, దువ్వూరువారిపాళెం, పిడతాపోలూరు, ఎంపీపాళెం, మామిడిపూడి, పొట్టెంపాడు తదితర గ్రామాల్లోని కోదండరామస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కల్యాణ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు.

⇨ ముత్తుకూరులో శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. అలాగే నక్కలమిట్టలోని కోదండరామస్వామి ఆలయంలో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

⇨ **కొడవలూరు:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని నార్తురాజుపాళెం వనమా శేషయ్య, పద్మావతమ్మ చారిటబుల్ ట్రస్ట్ భవన్‌లో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు దొరడ్ల సత్యనారాయణ, లలితమ్మలు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ట్రస్ట్ సభ్యులు దొరడ్ల శశిధర్, వెంకట సుప్రజ, ఉదయ్‌కిరణ్, కాంచన లక్ష్మి, సిద్ధా లక్ష్మి తనూజ, రామకృష్ణ పాల్గొన్నారు.

⇨ **ఇందుకూరుపేట:** ఇందుకూరుపేటలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవానికి ఉభయకర్తలుగా స్థానికులు గురుజాల బుజ్జిబాబు- కల్యాణి దంపతులు వ్యవహరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గునుపాటి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

⇨ పల్లిపాడులోని రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొత్తూరులోని సీతారామేశ్వరాలయంలో కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. ఉభయకర్తలుగా కైలాసం శ్రీనివాసలురెడ్డి- లావణ్య దంపతులు వ్యవహరించారు. శ్రీరామనవమి సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది.

⇨ **తోటపల్లిగూడూరు:** శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు రామమందిరాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు జరిగాయి వరిగొండలో ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో మూడు రోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వేడుకగా జరిగింది. దీనికి వావిలేటుపాడు పంచాయతీ మాజీ సర్పంచ్ మోపూరు రాధాకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. వ్యవస్థాపక ధర్మకర్త గండవరపు శ్యామలమ్మ, ఈఓ తాతా శ్రీనివాసరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

⇨ **మనుబోలు:** శ్రీరామనవమి వేడుకలను మండలంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మనుబోలు పడమటి, తూర్పు వీధిల్లోని రామాలయాల్లో అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ, కోదండరామపురంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు సాయికుమార్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. కోదండరామపురంలో కావేటి భార్గవ్, శాంతి దంపతులు సీతారాములకు నూతన వస్త్రాలు సమర్పించారు. కాండ్ర నరసారెడ్డి, శాంతి, ముత్యాల కల్యాణ్‌సాయి, సరిత ఉభయకర్తలుగా వ్యవహరించారు.



ముత్తుకూరు: పొట్టెంపాడులో కోదండరామస్వామి ఆలయం



పొదలకూరు: స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం



ఇందుకూరుపేటలో కల్యాణోత్సవం

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై ఏఐవైఎఫ్ నిరసన

- బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడం దుర్మార్గం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ నాయకులు రామరాజు, షాన్‌వాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి మోదీ ప్రధాన మంత్రి అయినప్పటి నుంచి ముస్లింలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆరోపించారు. అయితే ఇప్పుడు ముస్లింలకు మేలు చేసేందుకే అంటూ వక్ఫ్ బోర్డు సవరణ చేపట్టుతూ, మరో వైపు ముస్లింలను దొంగలుగా, టెర్రరిస్టులుగా ప్రచారం చేస్తూ వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అయోధ్యలో 13 వేల ఎకరాలు, కేదారీనాథ్‌లో 300 కేజీల బంగారం మాయమైతే వాటిని పరిరక్షించలేని బీజేపీ వక్ఫ్ ఆస్తులను ఎలా రక్షిస్తుందని ప్రశ్నించారు. ముస్లింలకు అండగా ఉంటామని చెప్పిన చంద్రబాబు పవన్ కల్యాణ్‌తో కలిసి వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం తెలపడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రమణయ్య, ఏఐవైఎఫ్ నాయకులు గౌస్‌బాషా, మధు, సర్దార్, బాదుల్లా, రియాజ్, షబ్బీర్, వెంకటేశ్వర్లు, సాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవలకు నేటి నుంచి బ్రేక్

- బకాయిల విడుదలకు సమ్మె బాట

నెల్లూరు(అర్బన్): ఎన్టీఆర్ వైద్యసేవా పథకం బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు సోమవారం నుంచి సమ్మె బాట పట్టనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గత శుక్రవారం జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్‌కు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ సుధీర్‌కుమార్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. అయితే ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో జిల్లాలో ఆరోగ్య సేవలు నిలిపేసి సమ్మె చేయనున్నామని అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, అరవింద్ కిడ్నీ వైద్యశాల అధినేత డాక్టర్ నారాయణరావు తెలిపారు. కాగా జిల్లాకు సంబంధించి సుమారు 200 కోట్ల వరకు బకాయిలున్నాయి. దీంతో జిల్లాలో 28 ఆస్పత్రుల్లో సమ్మె కొనసాగనుంది.

